క్లుప్తంగా

జంగుబాయి దేవతకు పూజలు



పూజలు చేస్తున్న దీక్షాపరులు

కడెం: మండలంలోని కొత్త మైసంపేట్ గ్రామంలో ఆదివారం ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వాయిపేట్, నారాయణపూర్, గోధుమల్లే, రాంజీగూడ తదితర గ్రామాలకు చెందిన జంగుబాయి దీక్షాపరులకు ఆదివాసీలు తమ సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలికారు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఆలయ కమిటీతో గ్రామస్తులు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మాదాసు రాజేందర్, ఉపాధ్యక్షుడిగా లక్కవత్తుల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాకాల రమేశ్, కోశాధికారిగా గుండా సతీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అధికారులతో సమావేశం

ముధోల్: కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై ఆదివారం మండలస్థాయి అధికారులతో తహసీల్దార్ శ్రీకాంత్ సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వేలు, లబ్ధిదారుల ఎంపికపై చర్చించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్ తదితరులు ఉన్నారు.

'రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ'



మాట్లాడుతున్న ఎండీ జాబీర్ అహ్మద్

భైంసాటౌన్: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తున్న రేషన్‌కార్డులకు సంబంధించి జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందవద్దని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్ సూచించారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని.. జాబితాలో పేర్లు లేనివారు మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని 26వార్డుల్లో ఈనెల 21 నుంచి 24 వరకు వార్డుసభలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి వార్డుసభల్లో అధికారులు అందుబాటులో ఉంటారని.. పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామసభల తేదీల్లో మార్పులు

లక్ష్మణచాంద: గ్రామసభలు నిర్వహించే తేదీల్లో స్వల్ప మార్పులు జరిగాయని.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 21నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాధ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం వడ్యాల్‌తండా, తిర్పెల్లి, చింతల్‌చాంద, ధర్మారం, కనకాపూర్, లక్ష్మణచాంద గ్రామాల్లో, ఈనెల 22న పార్‌పెల్లి, న్యూకంజర్, నర్సాపూర్, మల్లాపూర్, మునిపెల్లి గ్రామాల్లో, ఈనెల 23న వడ్యాల్, పీచర గ్రామాల్లో, ఈనెల 24న పొట్టపెల్లి(కే), బాబాపూర్, బోరిగాం, చామన్‌పెల్లి, రాచాపూర్ గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్మల్ కవులకు జాతీయ పురస్కారాలు



పురస్కారం స్వీకరిస్తున్న నారాయణ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు కవులు జాతీయస్థాయి సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు స్వీకరించారు. శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ, శ్రీఆర్యాణి సకల కళావేదిక సంయుక్తంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్ వేదికగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంబటి నారాయణ సాహితీరత్న, తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు సాహితీ కిరణం పురస్కారాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీగౌతమేశ్వర, శ్రీ ఆర్యాణి వీరిని స్వర్ణకంకణం, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. వీరిని నిర్మల్‌కు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు అభినందించారు.




పురస్కారం స్వీకరిస్తున్న హన్మంతు

సాగునీరు అందేదెలా..?



తానూరులో అలుగు ద్వారా పోతున్న నీరు



తానూరులో కాలువ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు



గండిపడిన హిప్నెల్లి చెరువు

- తానూరు మండలంలో దెబ్బతిన్న చెరువుల కాలువలు
- బీళ్లుగా ఆయకట్టు భూములు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల చెరువుల నుంచి పంటలకు సాగునీటిని అందించే కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా చెరువులను నమ్ముకొని పంటలను పండిద్దామనుకుంటున్న ఆయకట్టు రైతులకు నిరాశే మిగులుతోంది. ఈఏడాది కురిసిన భారీవర్షాలకు తానూరు మండలంలోని చెరువులు నిండుకుండలా మారాయి. కానీ సదరు చెరువు కాలువలు, అలుగులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరడం లేదు. దీంతో రైతుల భూములు బీళ్లుగా మారుతున్నాయి.

మూడున్నర దశాబ్దాల కిందట..

మండలంలోని బోల్సా, తానూరు, కోలూరు, కోలూరుతండా, ఖర్బాల, కోలూరు,కోలూరుతండా, మొగ్లి, మహలింగి, భోసి, ఉమ్రి(కే) గ్రామాల్లో మూడున్నర దశాబ్దాల కిందట రూ.లక్షలు వెచ్చించి చెరువులు నిర్మించారు. కానీ ఈ చెరువుల నుంచి పంటలకు నీటిని తీసుకెళ్లే కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో అలుగు ద్వారా నీరు వృథాగా పోతుంది.



నిండుగా ఖర్బాలా తానూరు చెరువు

హిప్నెల్లి చెరువుకు గండి..

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు హిప్నెల్లి గ్రామంలో ఉన్న చెరువుకు గండిపడింది. అధికారులు ఇప్పటికీ మరమ్మతు చేపట్టలేదు.

ఆయకట్టుకు అందని సాగు నీరు..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చెరువుల కాలువలకు ఒక్కసారి కూడా మరమ్మతులు చేపట్టలేదు. ఒక్కో చెరువు కింద 200 నుంచి 300 ఎకరాల వరకు భూమి సాగవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కానీ చెరువుల కాలువలు దెబ్బతినడంతో సమీపంలో ఉన్న వ్యవసాయ భూములు నీరందక బీళ్లుగా మారుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకం కింద చెరువులకు మరమ్మతులు చేపట్టినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. ఆయా గ్రామాల్లో నిర్మించిన చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి మరమ్మతులు చేపడితే తమకు మేలు జరుగుతుందని రైతులు.. అధికారులను వేడుకుంటున్నారు.

పొలాలకు నీరందడం లేదు



బోరిగాంలో చెరువు కాలువలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో పంట భూములకు సాగు నీరందడం లేదు. అధికారులు కాలువలకు మరమ్మతులు చేయించి.. రైతుల భూములకు సాగు నీరు అందేలా చూడాలి. – గంగాధర్, బోరిగాం

చెరువుకు మరమ్మతు చేపట్టాలి



ఈసారి వర్షాలకు హిప్నెల్లి సమీపంలో చెరువుకట్ట తెగి పోయింది. దీంతో ప్రస్తుతం చెరువులో చుక్క నీరు లేకుండా పోయింది. చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలి. – రాంపటేల్, హిప్నెల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఆయా గ్రామాల్లో చెరువులు, కాలువల మరమ్మతు విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. చెరువుల కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం. – లింగంమూర్తి, తహసీల్దార్



లక్ష్మణచాంద: సరస్వతి కాలువ ద్వారా కనకాపూర్ వాగులోకి నీటిని విడుదల చేస్తుండటంతో మండలంలోని వడ్యాల్ సమీపంలో చెక్‌డ్యాం నిండుగా పారుతూ జలకళ సంతరించుకుంది. అటుగా వచ్చిపోయేవారు పొలాల నడుమ వాగుపై ఉన్న ఈ నీటి అందాలను తిలకిస్తూ ఆహ్లాదం పొందుతున్నారు.

వెదజల్లే పద్ధతిలో లాభాలు

ఖానాపూర్: వడ్లను వెదజల్లే పద్ధతిలో వరి పంటను సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు పలువురు రైతులు. గతంలో మంచి దిగుబడులు రాగా.. ఈసారి కూడా అదే పద్ధతిలో సాగు చేస్తున్నట్లు వివరించారు. ఈ పద్ధతిలో వరి పండిస్తే పొలంలో కలుపు సమస్యలుండవు. పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని అంటున్నారు. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 10 కిలోల వరకు విత్తనాలు సరిపోతాయి. విత్తనాలు తీసుకొచ్చి నారు పెంచి నాట్లు వేయడం ద్వారా పిలకలు తక్కువ వస్తాయి. కూలీల ఖర్చు కూడా ఎక్కువ. వెదజల్లే పద్ధతిలో పిలకలు ఎక్కువ వచ్చి అధిక దిగుబడి పొందే వీలుంటుందని సత్తన్‌పల్లి క్లస్టర్ ఏఈవో రాకేశ్ పేర్కొంటున్నారు. గతంలో కూడా ఈ విధానంలో వరిసాగు చేస్తే మంచి లాభం వచ్చిందని.. నాటు వేసే విధానంతో పోలిస్తే ఎకరాకు రూ.8 వేలకు పైగా తక్కువ పెట్టుబడి అవుతుందని పలువురు రైతులు తెలిపారు.



వెదజల్లే పద్ధతిలో సాగవుతున్న వరి

ఖర్చు తక్కువ



వెదజల్లే విధానం బాగుంది. విత్తనాలు నానబెట్టి మొలక వచ్చాక పొలంలో చల్లుతున్నాం. దీంతో కూలీల ఖర్చు తగ్గుతుంది. దిగుబడి పెరుగుతుంది. – భీమన్న, పాతఎల్లాపూర్

అటెన్షన్ ప్లీజ్.. ఇంకెప్పుడు ప్రారంభిస్తరు..?



కుభీర్: మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో ఏడాదిన్నర కిందట నిర్మించిన దుకాణాల సముదాయం(ఆరు గదులు) ఇప్పటికీ ప్రారంభించలేదు. వెంటనే ప్రారంభించి గదులను అద్దెకు ఇస్తే మార్కెట్‌కు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటికైనా గదులను ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : గంగాధర్, మార్కెట్ కార్యదర్శి, ఫోన్: 80966 05108

చెత్తాచెదారం తొలగింపు



శుభ్రం చేస్తున్న కార్మికులు

కుంటాల: మండలకేంద్రంలోని పీహెచ్‌సీని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిసరాలు చెత్తతో అధ్వానంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆదివారం కుంటాల పంచాయతీ కార్యదర్శి రాజబాపు.. పారిశుద్ధ్య కార్మికులతో పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేయించారు.

నిబంధనలు పాటించాలి

భైంసాటౌన్: ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్సై ఎండీ గౌస్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రియదర్శినినగర్ పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం ఆ సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా మిట్టపెల్లి నర్సయ్య, అధ్యక్షుడిగా ఆడెపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి జల్దా రాజేశ్వర్, కోశాధికారిగా ఎడెల్లి రాజేశ్వర్, ఉప కోశాధికారిగా పులిపేట నర్సయ్య, సభ్యులు ఎన్నికయ్యారు.

ఓపెన్ పాఠశాల తనిఖీ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ పాఠశాలను రాష్ట్ర కోఆర్డినేటర్ సుజాత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. హెచ్‌ఎం రాజునాయక్‌కు పలు సూచనలు చేశారు. ఓపెన్ పాఠశాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, బోధకులు అశోక్, నారాయణవర్మ, రమాదేవి, శ్రీపాద, మహేందర్ పాల్గొన్నారు.

చేనులోనే తెల్లబంగారం



కుంటాల: మండలంలోని దౌనెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దౌనెల్లితండాలో జాదవ్ నరేందర్ చేనులో పత్తి పంట చివరిదశకు చేరింది. కూలీలు దొరకకపోవడంతో మొక్కలపైనే పంట ఉండిపోయింది. కుటుంబసభ్యులమంతా కలిసి పత్తి ఏరేందుకు సిద్ధమైనట్లు రైతు తెలిపాడు.

రేపటి నుంచే వార్డుసభలు

- మున్సిపాలిటీల్లో ఏర్పాట్లు పూర్తి
- 24 వరకు కొనసాగనున్న ప్రక్రియ

భైంసాటౌన్: రాష్ట్రప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసాకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగుతోంది. సోమవారంతో ఈ ప్రక్రియ పూర్తి కానుండగా, 21 నుంచి వార్డుసభలు నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి వార్డు ఆఫీసర్, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో సభలు జరుగనున్నాయి. పట్టణాల్లో ఉపాధిహామీ పథకం అమలులో లేని కారణంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయడం లేదు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా పథకాలకు మాత్రమే అర్హులను గుర్తిస్తున్నారు. 24 వరకు వార్డుల వారీగా వార్డుసభలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు మున్సిపాలిటీల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు.

భైంసా మున్సిపాలిటీలో..

తేదీ	వార్డులు	వార్డుసభ వేదిక
21	1,2,16	ఫిల్టర్‌బెడ్, కుంటప్రాంతం
	4,6	హనుమాన్ మందిర్, ఏపీనగర్
22	19,20	మదీనా ఫంక్షన్‌హాల్
	22	బోయిగల్లి సంఘం
	23	మున్నూరుకాపు సంఘం, భట్టిగల్లి
	24	శిశుమందిర్, షకీల్‌గల్లి
	25	ఇక్రా స్కూల్, బంగాలగల్లి
	26	అల ఫలా స్కూల్, జైనులాబుద్దీన్ గల్లి
23	3,5,18	ఎంపీపీఎస్, ఓవైసీనగర్
	11	మున్నూరుకాపు సంఘం ఆఫీస్, భట్టిగల్లి
	12	మార్వాడీ ధర్మశాల, పురాణబజార్
	14	మహాదేవ్‌మందిర్, కిసాన్‌గల్లి
	15	అశుర్‌ఖానా, బారాఇమామ్‌గల్లి
24	7	బుద్ధవిహార్, రాహుల్‌నగర్
	8	హనుమాన్ మందిర్, రాజీవ్‌నగర్
	9	శిశుమందిర్, పులేనగర్
	10	ఎస్సీ కమ్యూనిటీహాల్, అంబేద్కర్‌నగర్
	13	ఎస్సీ కమ్యూనిటీహాల్, సిద్ధార్థనగర్
	17,21	ముస్లిం ఫంక్షన్‌హాల్

నిర్మల్ మున్సిపాలిటీలో..

తేదీ	వార్డులు	వార్డుసభ వేదిక
21	1	బాపూజీ సంఘం, గాంధీనగర్
	2	నాయుడువాడ హనుమాన్ మందిర్
	3	మున్నూరుకాపు సంఘం, రాంరావుబాగ్
	4	ముదిరాజ్ సంఘం, బంగల్‌పేట్
	5	గంగపుత్ర సంఘం, బంగల్‌పేట్, బోయివాడ
	6	మున్నూరుకాపు సంఘం, వెంకటాద్రిపేట్
	7	కంబల్‌పోష్ మసీదు కమ్యూనిటీ హాల్, షేక్‌సాబ్‌పేట్
	8	అంబేడ్కర్ భవన్, కూరన్నపేట్
	9	ఆంజనేయ యువజన సంఘం, బాగులవాడ
	10	బీసీ సంఘం, గొల్లపేట్
	11	గ్రామపంచాయతీ ఆఫీస్, వెంకటాపూర్
	12	వడ్డెర సంఘం, శాంతినగర్
22	13	రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్, శాస్త్రినగర్
	14	కమ్యూనిటీహాల్, సోఫినగర్
	15	పడిగెల భూమవ్వ ఫంక్షన్‌హాల్, ఈద్‌గాం
	16	పీహెచ్‌సీ, రాంనగర్
	17	ప్రభుత్వ ప్రైమరీ స్కూల్, ఆస్రకాలనీ
	18	గ్రామపంచాయతీ, మంజులాపూర్
	19	ఎస్సీ కమ్యూనిటీ హాల్, మంజులాపూర్
	20	ఐడల్ స్కూల్, బర్కత్‌పుర
	21	బాపూజీ భవన్,గాజుల్‌పేట్
	22	ప్రభుత్వ ప్రైమరీ స్కూల్, వైఎస్సార్ కాలనీ
23	23	కమ్యూనిటీ హాల్, కబూతర్ కమాన్
	24	గర్ల్స్ హైస్కూల్, సోమవార్‌పేట్
	25	రెడ్డికాపు సంఘం, బెస్తవార్‌పేట్
	26	రథాల టెంపుల్, బ్రాహ్మణసంఘం
	27	దేవరకోట టెంపుల్ దుకాణాలు
	28	మున్నూరుకాపు సంఘం, ద్యాగవాడ
	29	కస్బ స్కూల్ గ్రౌండ్
	30	ఆంజనేయ యువజన సంఘం, బాగులవాడ
	31	గంగపుత్ర సంఘం, బస్‌డిపో
	32	అంబేద్కర్ భవన్, మున్సిపల్ ఆఫీస్ దగ్గర
24	33,41	అంబేద్కర్ భవన్, మున్సిపల్ ఆఫీస్ దగ్గర
	34	లయన్స్‌క్లబ్, ప్రియదర్శిని నగర్
	35	బాపూజీ భవన్, గాజుల్‌పేట్
	36,38	మున్నూరుకాపు సంఘం, బుధవార్‌పేట్
	37	మోచి సంఘం, బుధవార్‌పేట్
	39	దేవరకోట టెంపుల్ షాప్స్, మార్కెట్
	40,42	మున్నూరుకాపు సంఘం, చింతకుంటవాడ

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముధోల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో అందరం ఐక్యంగా ఉండి.. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్: మండలంలోని పల్సి గ్రామానికి చెందిన సీలం ద్రుపతి ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగిన బస్సు దగ్ధమైన ఘటనలో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాములు, నాయకులు కుభీర్ రాములు, అలికె దత్తాత్రి, కల్యాణ్ తదితరులు ఉన్నారు.

తానూరులో బోనాల పండుగ



బోనాలతో ఆలయానికి వస్తున్న గ్రామస్తులు

తానూరు: మండలకేంద్రంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు గ్రామదేవతలకు బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విఠలేశ్వరస్వామి ఆలయం నుంచి బోనాలు ఎత్తుకొని డప్పువాయిద్యాలతో మహాలక్ష్మి ఆలయానికి ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.